క్లుప్తంగా

శనైశ్చరునికి భక్తుల తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని భక్తులు దర్శించుకుని తైలాభిషేకాలు జరిపించారు. శనివారం తెలవారుజామున ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులను స్వామివారి పూజలు, తైలాభిషేకాలకు అనుమతించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా రూ.1,65,065, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.37,705తో దేవస్థానానికి మొత్తం రూ.2,02,770 ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ తెలిపారు.

రేపు బంగారు పాప తీర్థం



కొత్తపేట గ్రామ దేవత బంగారుపాప

కొత్తపేట: గ్రామ దేవతగా, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా విరాజిల్లుతున్న బంగారు పాప అమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి తరువాత వచ్చే సోమవారం తీర్థ మహోత్సవం నిర్వహించడం పూర్వం నుంచీ ఆనవాయితీగా వస్తుంది. ఆ ప్రకారం శనివారం రాత్రి చిన్న జాతర నిర్వహించగా, ఆదివారం రాత్రి పెద్ద జాగరం నిర్వహిస్తారు. సోమవారం తీర్థం జరుగుతుంది. తీర్థానికి నెల రోజుల ముందు నుంచీ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.
ఆలయ కమిటీ అధ్యక్షుడు బాబ్జి ఆధ్వర్యంలో జాతర, తీర్థ మహోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. తీర్థం సందర్భంగా గ్రామస్తులతో పాటు ఉద్యోగ, ఉపాధి పేరిట, వివాహాలతో అత్తవారిళ్లకు వెళ్లిన గ్రామ ఆడపడుచులు విధిగా తీర్థం నాడు వచ్చి అమ్మవారిని దర్శించుకుని, నైవేద్యాలు సమర్పిస్తారు.

16 మంది ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు



నగరంలో సర్వే పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ ఘని

మామిడికుదురు: ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపులో భాగంగా మామిడికుదురు మండలంలో 16 మంది బాలలను గుర్తించామని సమగ్ర శిక్ష పరిశీలకులు సుశీల, హిమబిందు తెలిపారు. మండల పరిధిలో శనివారం మామిడికుదురు, నగరం తదితర గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాష్ట్ర పరిశీలకులు అబ్దుల్ ఘని మామిడికుదురులో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. నగరం గ్రామంలో కొనుకు యక్షితను గుర్తించి పాఠశాలల పునః ప్రారంభం నాటికి ఆ చిన్నారిని బడిలో చేర్పించాలని ఆమె పేరెంట్స్‌కు సూచించారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల వద్ద ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. పుల్లేటికుర్రులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. 50 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇంద్రావతి మాట్లాడుతూ గర్భిణులు ప్రతి ఒక్కరూ పోషకాలు ఉన్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి నెలా విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

15వ తేదీలోగా నారుమడులు వేసుకోవాలి

అంబాజీపేట: పంట కాల్వ సాగు నీరు జూన్ ఒకటో తేదీన విడుదల చేయనున్న నేపథ్యంలో ఖరీఫ్ పంటకు సంబంధించి నారుమడులు 15వ తేదీలోగా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ రైతులకు సూచించారు. అంబాజీపేట మండలంలోని కె.పెదపూడి, గంగలకుర్రు, ముక్కామల తదితర గ్రామాల్లో రైతులను శనివారం కలసి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో వరి కోతలు నూరు శాతం పూర్తి చేశారన్నారు. వీలైనంత త్వరగా వరి నారుమడులు వేసుకోవాలని రైతులకు వివరించారు. వచ్చే జూలై 10 నాటికి వరి నాట్లు పూర్తి చేసుకోవచ్చన్నారు. దీని వల్ల నవంబర్ నెలలో వచ్చే తుపానుల బారిన పడకుండా ఉంటామన్నారు. రబీలో వరి సాగు త్వరితగతిన పూర్తి చేసుకోవచ్చన్నారు. రైతులు ముందస్తు నాట్లు వేసుకోవడం మూడో పంటగా అపరాల సాగు చేసుకోవచ్చన్నారు. ఏఈఓ డి.దుర్గారావు ఆయన వెంట ఉన్నారు.

బంగారు భవితే లక్ష్యం

- దివ్యాంగులు బడిబాట పట్టేలా అధికారుల సర్వే
- ప్రత్యేక అవసరాలు గల బాలలకు వెసులుబాటు
- శిక్షణ, బోధనతో బాసట



గంగలకుర్రు అంగన్‌వాడీ కేంద్రంలో దివ్యాంగుల కోసం సర్వే చేస్తున్న అధికారులు

అంబాజీపేట: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఇంటికే పరిమితం కాకుండా వారిలో మానసికంగా, శారీరకంగా ఎదుగుదల తీసుకురావాలనే లక్ష్యంతో భవిత కేంద్రాల ద్వారా వారికి మానసిక, శారీరక తర్ఫీదు ఇస్తూ చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది. గత ఏడాది సమీప పాఠశాలల్లో విద్య అభ్యసనకు సిద్ధమైంది. శారీరక, మానసిక వైకల్యం బారిన పడిన పిల్లలకు ఇప్పటి వరకూ తమను ప్రత్యేకంగా విభజించారనే భావన కలగకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పలు విధి విధానాల అమలు కూడా ప్రారంభించింది. ప్రాథమిక పాఠశాల సమీప భవిత కేంద్రాలను వాటితో అనుసంధానించారు. దీనిలో భాగంగానే పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో దివ్యాంగుల కోసం అధికారులు సర్వే చేపట్టారు. సాధారణ పిల్లలతో కలిసి వీరు విద్యాబుద్ధులు నేర్చుకోవడం ద్వారా వారిలో ఆలోచనలు వృద్ధి చెందుతాయనే భావనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చిన్నారుల వైకల్యాలు గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్యను బోధించారు. ఈ తరహా విద్య, శిక్షణలో వృద్ధి చెందిన వారిని ఆపై సాధారణ పాఠశాలల్లో చేర్పించారు. ప్రస్తుతం పిల్లలు వేర్వేరుగా కాకుండా వారిలో అందరూ సమానమనే భావనను పెంపొందింపజేసేందుకు సాధారణ విద్యార్థులతోనే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన చదువు చెప్పించేలా చర్యలు తీసుకుంది. అక్కడ ఐఈఆర్‌టీలతో పిల్లలకు విద్యబోధిస్తారు. అక్కడే మధ్యాహ్న భోజనం, విద్యా కానుక కిట్లు విద్యాదీవెన వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఫిజియో థెరపిస్టులు, వ్యాయామం, స్పీచ్ థెరపీ, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఐఈఆర్టీలు, ఫిజియో థెరపిస్టులు వారి పర్యవేక్షణలో పని చేయాల్సి ఉంటుంది.

బహుళ ప్రయోజనాలు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు చేరితే ప్రతి నెలా రూ.300 రవాణా భత్యం చెల్లిస్తారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ట్యాబ్‌లతో పాటు తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం ఏడాదికి రూ.9 వేల నుంచి 11 వేలు అందజేస్తారు. వైకల్య శాతం అధికంగా ఉంటే సదరం ధ్రువపత్రంతో పింఛను వస్తుంది. బస్సు, రైల్వేలో పాస్ సౌకర్యంతో పాటు పాఠశాలకు రాలేని వారి ఇంటికి వచ్చి బోధనతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలాంటి వారికి పాఠశాలకు వచ్చినట్టే హాజరు నమోదవుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగులు బడిబాట పట్టేలా సర్వే ముమ్మరం చేశాం. చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్య బోధిస్తాం. వైకల్యం కలిగిన పిల్లల్లో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సహిత విద్య తోడ్పడుతుంది. వైకల్యానికి అనుగుణంగా పరికరాలు ఉపయోగించి వారికి లైఫ్ స్కిల్స్ నేర్పించడం ద్వారా తోటి విద్యార్థులతో కలసి చదువుకునేలా కృషి చేస్తున్నాం.

– టి.రామకుమారి, స్పెషల్ ఎడ్యుకేటర్, అంబాజీపేట

భారీ వృక్షాన్ని తొలగించారు



కె.పెదపూడిలో తొలగించిన భారీ వృక్షం

సాక్షి ఇంపాక్ట్

అంబాజీపేట: కె.పెదపూడిలో ప్రధాన రహదారి పక్కనే ప్రమాద భరితంగా నేలకొరిగి ఉన్న భారీ వృక్షాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు తొలగించారు. ప్రమాద స్థితిలో ఒరిగిన భారీ వృక్షం అనే వార్త కథనం సాక్షి దినపత్రికలో ఈ నెల 23న వెలువడింది. దాంతో సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదంగా ఉన్న భారీ వృక్షాన్ని తొలగించారు. దాంతో ప్రయాణికులు, స్థానికులు, బాటసారులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా శ్రీరామ మందిర వార్షికోత్సవం

మామిడికుదురు: గ్రామ శివారు ఈర్లచెరువులో కొలువుదీరిన శ్రీసీతారామచంద్ర వరసిద్ధి వినాయక, షిర్డీ సాయిబాబా, కనకదుర్గాంబిక, నూకాలమ్మ వార్ల 11వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కుడుపూడి వెంకటశ్రీరామశెట్టి, పద్మావతి, ఏకాంబరేశ్వరరావు, నాగచంద్రావతి దంపతులు కర్తలుగా పాల్గొనా పూజలు జరిపించారు. దీనిలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అగ్నిప్రతిష్ఠాపన, పంచామృత మండపారాధన, మహాశాంతి హోమం, శాంతి కల్యాణం తదితర పూజలను ఘనంగా జరిపించారు. వార్షికోత్సవంలో భాగంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

టార్పాలిన్ అందజేత



మోరిలో మాదాసు కుటుంబానికి టార్పాలిన్, హైజెనిక్ కిట్ అందజేస్తున్న సంస్థ జీవితకాల సభ్యులు

సఖినేటిపల్లి: ఒక స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇంటి నిర్మాణం జరుగుచున్న పేద కుటుంబానికి నివాసం ఉంటున్న పందిరికి వర్షం నుంచి రక్షణకై రెడ్‌క్రాస్ సంస్థ శనివారం ఒక టార్పాలిన్, హైజెనిక్ కిట్ అందించింది. మోరిలో మాదాసు శేషారత్నం కుటుంబానికి మానవతా మూర్తులు గ్రూపు ద్వారా సేకరించిన మొత్తంతో ఇంటి నిర్మాణం సాగుతోంది. ఇల్లు పూర్తయ్యే లోగా తాత్కాలికంగా నిర్మించిన పందిరికి వర్షానికి రక్షణ లేకపోవడంతో రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల సంస్థ సమన్వయ కర్త జంపన బుజ్జి రాజు, సంస్థ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్, చైర్మన్‌ల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంజూరైన టార్పాలిన్, హైజెనిక్ కిట్‌లను రెడ్‌క్రాస్ జిల్లా సహాయ కార్యదర్శి బోణం రాజు సమన్వయంతో సంస్థ జీవితకాల మెంబర్లు బోణం సూర్యప్రకాశరావు, బీవీవీ సత్యనారాయణ, వీరా కృష్ణ, జి.వీరభద్రం, వి.నరేష్ చేతుల మీదుగా వారికి అందజేశారు.

హైస్కూల్‌లో జూనియర్ కళాశాల ప్రారంభం

అంబాజీపేట: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను పుల్లేటికుర్రులో జెడ్పీ హైస్కూల్‌లో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు హెచ్‌ఎం కె.సూర్యకనకదుర్గ తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఉన్నతాధికారుల నుంచి ఒకటవ తేదీ నుంచి ఇంటర్మీడియట్ కో ఎడ్యుకేషన్ తరగతులు నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఎంపీసీ, సీఈసీ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వాటిలో ఏదో ఒకటి విద్యార్థులు ఎంపిక చేసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం ఎంపీసీకి 40 మంది, సీఈసీకి 40 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరేలా విద్యార్థులను చైతన్య పరుస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుభవజ్ఞులైన ఏడుగురు లెక్చరర్లను నియమించారన్నారు. గ్రామాల్లోని ఇంటర్ చేరే విద్యార్థులకు ప్రభుత్వ ఉచిత జూనియర్ కళాశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో బాలికల జూనియర్ కళాశాల ఇప్పటికే ప్రారంభించారు.

'రామం'కు జీహెచ్‌పీయూ సేవారత్న అవార్డు ప్రదానం



చెన్నైలో జీహెచ్‌పీయూ సేవారత్న అవార్డును అందుకుంటున్న రామం



చెన్నైలో జీహెచ్‌పీయూ గౌరవ డాక్టరేట్, కళారత్న అవార్డు స్వీకరిస్తున్న సుబ్బారావు

కొత్తపేట: స్థానిక పురోహితుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి (రామం)కు అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జీహెచ్‌పీయూ) సేవారత్న అవార్డును ప్రదానం చేసింది. వృత్తిరీత్యా వివిధ ఆలయాల్లో అర్చకుడిగా, గ్రామ పురోహితుడిగా, వివిధ యజ్ఞయాగాదులు, దైవ కల్యాణోత్సవాల కర్తగా వ్యవహరించే రామం దేశ, విదేశాల కరెన్సీ, నాణేలు, డాలర్లు, రకరకాల వస్తువులు, నవరత్నాలు, పూసలు, రుద్రాక్షలు వంటి అరుదైన వాటితో పాటు 124 సంవత్సరాల పంచాంగాలు, అరుదైన మొక్కలు సేకరణ ఆయన ప్రవృత్తి. వివిధ రూపాల్లో సేవా కార్యక్రమాల ద్వారా అనేక సంస్థల అవార్డులు, రికార్డులు సాధించారు. రామం ప్రతిభ, సేవలను గుర్తించిన జీహెచ్‌పీయూ సేవారత్న అవార్డుకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు శనివారం చెన్నై భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో జీహెచ్‌పీయూ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ పి.మాన్యూల్ అధ్యక్షతన జరిగిన యూనివర్సిటీ సెమినార్‌లో తమిళనాడు స్టేట్, చెన్నై పట్టణాలకు చెందిన ప్రముఖుల చేతుల మీదుగా రామం సేవారత్న అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రామంను పలువురు ప్రముఖుల, స్థానికులు అభినందించారు.
అలాగే స్థానిక ఒక ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు, కవి, రచయిత వేలుసు వీరవెంకట సత్య సుబ్బారావుకు అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జీహెచ్‌పీయూ) గౌరవ డాక్టరేట్, భారత్ కళారత్న అవార్డులను ప్రదానం చేసింది. వృత్తి రీత్యా అధ్యాపకుడిగా, ప్రవృత్తి రీత్యా వివిధ పౌరాణిక, రంగస్థల, సాంఘిక నాటకాల్లో ప్రధాన పాత్రల కళాకారుడిగా, కవి, రచయితగా బహుముఖ ప్రతిభను చాటుకుంటున్న సుబ్బారావును శనివారం చెన్నై భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో జీహెచ్‌పీయూ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ పి.మాన్యూల్ అధ్యక్షతన జరిగిన యూనివర్సిటీ సెమినార్‌లో ముఖ్యఅతిథుల చేతులు మీదుగా సుబ్బారావు గౌరవ డాక్టరేట్‌ను, భారత్ కళారత్న అవార్డులను అందుకున్నారు. ఆయనకు పలువురు స్థానికులు అభినందనలు తెలిపారు.

సేవలు అభినందనీయం



చింతలమోరిలో బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: మండలంలోని చింతలమోరి గ్రామం, బీచ్ నగర్ వాస్తవ్యులు గుండుబోయిన సత్యనారాయణ కుటుంబం ఆ గ్రామంలో దయనీయమైన పరిస్థితిలో ఉన్నారు. రోజువారీ కూలీ చేసుకుంటూ కష్టపడుతూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇటీవల ఆరోగ్యం సహకరించక ఇల్లు గడవటం కూడా కష్టంగా ఉంది. దీనికి తోడు వారి నివసిస్తున్న గృహం కూడా ప్రమాదవశాత్తూ కూలిపోయింది. వారి పరిస్థితిని గమనించి విషయాన్ని గ్రామస్తులు మన 'ఆదర్శ ఆంధ్ర యూత్ కువైట్' 'సామాజిక సేవాసంఘం' వ్యవస్థాపకుడు మోకా నరసింహస్వామి (ఆర్టిస్ట్), ఇంజేటి కృష్ణకుమార్‌లకు తెలిపగా, సంస్థ స్పందించింది. సత్యనారాయణ గృహ నిర్మాణం కోసం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం చింతలమోరిలో అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు ఆపదలో అండగా ఉంటున్న సంస్థను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోటే రాజేష్, తాడి సహదేవ్, కొల్లాబత్తుల భీమారావు, కొల్లాబత్తుల రత్నంరాజు, నల్లి బాబురావు, రాపాక స్టీవెన్, కొల్లాపత్తుల శ్యామ్ కుమార్, దొండపాటి గిరిబాబు, రాపాక రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అలసత్వం వహించవద్దు



అంబాజీపేటలో మాట్లాడుతున్న డీపీవో రాంబాబు

అంబాజీపేట: గ్రామాల్లో అలసత్వం వహించకుండా పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీపీవో డి.రాంబాబు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులకు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్టిలో ఉంచుకుని తాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు రక్షిత మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వారం నుంచి ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో హౌస్ టాక్స్ తదితర అంశాలపై పరిశీలన చేయనున్నారన్నారు. ప్రతి గ్రామంలోను పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. స్వచ్ఛభారత్ మిషన్, టాక్స్‌లు, నాన్ టాక్స్‌లు తదితర అంశాలపై వివరించారు. అనంతరం మాచవరం పంచాయతీ జీవీవీకే కుమార్ ఆధ్వర్యంలో డీపీఓ రాంబాబును ఘనంగా సత్కరించారు. సమావేశంలో డీఎల్పీవో బొజ్జిరాజు, ఈఓపీఆర్డీ బి.మమత తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసి పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం మొక్కుగా చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

భక్తుల కిటకిట

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీశ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

2న సహస్ర హనుమాన్ చాలీసా పారాయణ



రావులపాలెంలో హనుమాన్ చాలీసా పారాయణ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

రావులపాలెం: హనుమాన్ జయంతి సందర్భంగా జూన్ రెండో తేదీన అమలాపురంలోని కాపు కల్యాణ మండపంలో సహస్ర హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం జరుగుతుందని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి తెలిపారు. స్థానిక ప్రగతి భారతం ట్రస్ట్ కార్యాలయంలో శనివారం అయిన విలేకరులతో మాట్లాడుతూ ఈ వివరాలను వెల్లడించారు. హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఆరోజు సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అలాగే ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయి దత్త నాగనంద స్వామి, స్వామి సూర్య భాస్కరేంద్ర సరస్వతి స్వామి వార్ల అనుగ్రహ భాషణం జరుగుతుందన్నారు. అనంతరం 11 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అందరూ పాల్గొని తరించాలన్నారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భమిడిపాటి కృష్ణమూర్తి, నాగరాజు, రవికుమార్, వెంకట కృష్ణారెడ్డి, తమలంపూడి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వ్యక్తి మృతి

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళుతున్న ఒక వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన తాళ్ల సతీష్‌కుమార్ (36) ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళుతుండగా లొల్లలాకుల వద్దకు వచ్చే సరికి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తీసుకువెళ్లారు. దీంతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు చిన్నాన్న తాళ్ల ప్రసాదరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.11 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన కురుపూడి సతీష్‌కి తలలో రక్తం గడ్డకట్టి పెరాలసిస్ బారిన పడ్డారు. వైద్యానికి చాలా ఖర్చు అవడంతో అంత ఆర్థిక స్తోమత లేక అప్పు చేసి, కొంత మంది చేసిన ఆర్థికసాయంతో వైద్యం చేయించారు. ఇంకా కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని మందులు వాడాలని డాక్టర్లు చెప్పారు. మందులు వాడడానికి కూడా డబ్బులు లేకపోవడంతో రావులపాలెం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో శనివారం రూ.11 వేల నగదును ఆర్థిక సాయంగా సభ్యులు అందజేశారు.

అప్పనపల్లిలో సందడి చేసిన భక్తులు

మామిడికుదురు: ఆపద మొక్కుల వాడా.. అనాథరక్షకా.. గోవిందా అంటూ భక్తుల కోలాహలం నడుమ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం కోలాహలంగా మారింది. వేలాది మంది భక్తులు ఉభయ దేవేరులతో కొలువుదీరిన బాలబాలాజీ స్వామి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు ఆనంద పరవశులయ్యారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. స్వామికి తలనీలాలు సమర్పించారు. వేసవి సెలవులు కావడంతో ఉదయం నుంచి భారీగా భక్తులు స్వామి వారి దర్శనానికి తరలి వచ్చారు. పాత గుడితో పాటు కొత్త గుడి, స్నానఘట్టం వద్ద భక్తులు సందడి చేశారు. వారికి వివిధ సేవల ద్వారా రూ.3.41 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి తెలిపారు. విజయవాడకు చెందిన చిట్టూరి వినయనాగశ్రీనివాసు, లక్ష్మీదుర్గ దంపతులు రూ.11,116 నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళంగా అందించారని చెప్పారు. ఈ నెల 29వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు స్వామి వారి హుండీల లెక్కింపు జరుగుతుందని ఈఓ మాధవి తెలిపారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో క్రీడాకారిణి ప్రతిభ



మీసాల మౌనిక

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలలో అంబాజీపేటకు చెందిన మీసాల మౌనిక ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించింది. ఈ నెల 21 నుంచి 24 వరకు విజయవాడలో మేరీస్టెల్లా కళాశాలలో కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మౌనిక పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కబర్చింది. ఈ పోటీలు 7వ ఏపీ యూత్ ఇంటర్ డిస్ట్రిక్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ (బాలుర, బాలికలు)లకు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి కెప్టెన్ మానస, వైస్ కెప్టెన్ మౌనికతో పాటు మరో పది మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ క్రీడాకారులు కడప, గుంటూరు, అనంతపురం, పశ్చిమ గోదావరి జిల్లా జట్లులపై గెలిచి కృష్ణా జిల్లా జట్టుపై విజయం సాధించి మొదటి స్థానంలో నిలిచినట్టు మౌనిక తెలిపింది. రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ అందుకున్న మౌనికను పలువురు క్రీడాకారులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

అన్నమయ్య సంకీర్తన అమృత భాండం

అయినవిల్లి: అన్నమయ్య సంకీర్తనలు అమృత భాండాగారమని కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. ఇటువంటి సంకీర్తలను చిన్నారు నోట వింటే మరింత రసరమ్యంగా ఉంటుందని ఆమె తెలిపారు. శనివారం ముక్తేశ్వరంలో క్షణముక్తేశ్వరాలయంలో ఆమె అన్నమయ్య సంకీర్తనలు చేయడంపై చిన్నారులకు శిక్షణనిచ్చారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై తొమ్మిది గంటల వరకూ ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న చిన్నారులు ఈ శిక్షణలో పాల్గొనవచ్చన్నారు. ఈ నెల 29 వరకూ అన్నమయ్య సంకీర్తలను పాడటం శిక్షణ ఉంటుందన్నారు.